క్లుప్తంగా

గిన్నిస్ వరల్డ్ రికార్డు గ్రహీతకు సత్కారం



సీడీపీవో మేరీ సువార్తను సత్కరిస్తున్న జెడ్పీటీసీ, అంగన్‌వాడీ సిబ్బంది

నర్సీపట్నం: సంగీతంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన సీడీపీవో మేరీ సువార్తను గురువారం ఐసీడీఎస్ కార్యాలయంలో జెడ్పీటీసీ సుకల రమణమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి సత్కరించారు.

మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు కృతజ్ఞతలు



మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా యాక్టివిటీ సెక్రటరీ సత్యనారాయణ

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ జిల్లా యాక్టివిటీ సెక్రటరీగా నియమితులైన సుర్ల సత్యనారాయణ గురువారం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సుదీర్ఘ కాలం పాటు పార్టీ మండల అధ్యక్షుడిగా పని చేసిన తనకు జిల్లా స్థాయిలో అవకాశం కల్పించారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పార్టీ మండల అధ్యక్షులు శానపతి వెంకటరత్నం, సుర్ల చంద్ర శేఖర్ తదితరులు ఉన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



మరిడిమాంబకు పూలమాల వేస్తున్న భక్తులు

కె.కోటపాడు: మండలంలో చౌడువాడ మేజర్ పంచాయతీలో జోడుగుళ్ల మరిడిమాంబ, బంగారమ్మ ఆలయాల్లో గురువారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఘనంగా మరిడమ్మ పండగ

మాకవరపాలెం: మండలంలోని భీమబోయిన పాలెంలో మరిడమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఏటా పండగను వైభవంగా నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో గురువారం కూడా స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు మరిడమ్మ ఆలయానికి తరలివచ్చి దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక యువకులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాత్రికి గ్రామంలో విద్యుత్ దీపాలంకరణతోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ రుత్తల నందకిషోర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనతో విజ్ఞాన సముపార్జన



పోలీసుల పనితీరును వివరిస్తున్న ఎస్‌ఐ దామోదర్‌నాయుడు

మాకవరపాలెం: విద్యార్థులకు ప్రత్యక్షంగా శాఖల పనితీరును వివరించడం వల్ల విషయ పరిజ్ఞానం పెరుగుతుందని ఎంఈవో మూర్తి తెలిపారు. ప్రభుత్వ శాఖల పనితీరుపై విద్యార్థులకు గురువారం స్టడీ టూర్ నిర్వహించారు. మండలంలోని తామరం-2, కొత్తపాలెం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్, విద్యుత్ సబ్ స్టేషన్, పశువైద్యాలయం, పీహెచ్‌సీ, విద్యాశాఖ కార్యాలయం, గిడుతూరు ఉన్నత పాఠశాలలో ల్యాబ్‌లను విద్యార్థులు సందర్శించారు. వాటి పనితీరుపై ఆయా శాఖల అధికారులు వివరించారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

గొలుగొండ: చిన్నయ్యపాలెంలో గొలుగొండ పోలీసులు గురువా రం ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఎస్‌ఐ రామారావు ఆదేశాలు మేరకు ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలన చేశారు. గతంలో కేసులు ఉన్న వాహనాల రికార్డులు పరిశీలించారు. హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలని, రికార్డులు లేకుండాగానీ మితిమీరిన వేగంతోగానీ వాహనాలు నడపరాదని వాహనదారులను హెచ్చరించారు.

పైలట్ ప్రాజెక్టుకు ముప్పు

ఇసుక తవ్వకాలతో పొంచి ఉన్న ప్రమాదం

కూటమి నేతల అండతో రేయింబవళ్లు ఇసుక వ్యాపారం

స్పీకరు ఇలాకాలో చోద్యం చూస్తున్న అధికారులు



పైలట్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న మైనింగ్, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు (ఫైల్)



తాండవ నదిలో ఇసుక తవ్వకాలు చేయకుండా కంచె ఏర్పాటు చేస్తున్న అధికారులు (ఫైల్)

నాతవరం: కూటమి నేతల అండతో తాండవ నదిలో ఇష్టానుసారంగా ఇసుక తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. దాంతో 20 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే పైలట్ ప్రాజెక్టుకు ముప్పు ఏర్పడింది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇలాకాలో ఇదంతా జరగడంతో అధికారులు కిమ్మనడం లేదు.

మండలంలో గుమ్మిడిగొండ పంచాయతీ శివారు చిక్కుడుపాలెం వద్ద తాండవ నదిలో పైలట్ ప్రాజెక్టు నిర్మించి సుమారుగా 20 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. మండలంలో అనంతపద్మనాభపురం, ఎం.బి.పట్నం, మన్యపురట్ల, గన్నవరం పంచాయతీల్లోని పలు గ్రామాల్లో ఫ్లోరైడ్ సమస్య ఉంది. ఈ సమస్యపై దృష్టి సారించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాండవ నదిలో పైలట్ ప్రాజెక్టు నిర్మించి పైపులైను ద్వారా పదేళ్లుగా ప్రజలకు తాగునీరు అందిస్తున్నారు. ఈ పైలట్ ప్రాజెక్టుపై ఆధారపడి రాజుపేట అగ్రహారం, లింగంపేట, మన్యపురట్ల, కొత్త రామచంద్రపురం, ఉప్పరగూడెం, గన్నవరం, నాయుడుపాలెం, వి.బి.అగ్రహారం, వై.బి.అగ్రహారం, మాసయ్యపేట, వై.బి.పట్నం, బుచ్చెంపేట, ఎ.శరభవరం, ఎం.బి.పట్నం తదితర గ్రామాలు ఉన్నాయి.



పైలట్ ప్రాజెక్టు ఉన్న ప్రదేశంలో ఇసుక తవ్వకాలు

అధికారుల హెచ్చరికలు బేఖాతర్..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుకను ఉచితంగా తవ్వుకోవడానికి అనుమతులు ఇచ్చారు. చిక్కుడుపాలెం వద్ద తాండవ నదిలో ఏర్పాటు చేసిన పైలట్ ప్రాజెక్టు సమీపంలో ఇసుక తవ్వకాలు చేయొద్దని నిబంధనలు ఉన్నాయి. అయినప్పటికీ కూటమి నేతల అండతో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. పైలట్ ప్రాజెక్టు చుట్టూ ఇసుక తవ్వకాలు చేయొద్దని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తవ్వకందారులకు హెచ్చరించారు. వారి మాటలు లెక్కచేయకుండా యథావిధిగా ఇసుక తవ్వేయడంతో పైలట్ ప్రాజెక్టు ప్రమాదాన్ని గ్రహించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మైనింగ్, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు సంయుక్తంగా తాండవ నదిలో ప్రాజెక్టును స్వయంగా పరిశీలించారు. ఇసుక తవ్వకాలు ఇదే విధంగా కొనసాగితే ప్రాజెక్టుకు ప్రమాదం పొంచి ఉందని నిర్ధారించారు. ఆయా శాఖల అధికారులు తాండవ నదిలో ప్రాజెక్టు సమీపంలో తవ్వకాలు చేపట్టకుండా ఉండేందుకు దారిలో ప్రత్యేకంగా కంచె ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ఇసుక తవ్వకాలు చేయొద్దని హెచ్చరికలు చేశారు. అప్పట్లో కొన్ని రోజుల పాటు ఇక్కడ తవ్వకాలు మానేశారు.

కంచె తీసేసి యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు...

అధికారులు ఏర్పాటు చేసిన కంచెను కూటమి నేతలు తీసేసి మరలా యథేచ్ఛగా నదిలో తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఉచిత ఇసుక పేరుతో కూటమి నేతలే దర్జాగా వ్యాపారం చేస్తున్నారు. ఉచిత ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లకు బ్యానర్లు మచ్చుకైనా కనిపించవు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, మైనింగ్ శాఖ అధికారులు కన్నుసన్నల్లో నిబంధనలు పాటించకుండా రేయింబవళ్లు అని తేడా లేకుండా ఇసుక వ్యాపారం చేస్తున్నారు. ఇక్కడ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడుకు భయపడి అధికారుల కళ్లెదుటే అన్యాయం జరుగుతున్న ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ఇటీవల నాతవరం పోలీసు స్టేషన్‌కు ఎస్పీ తుహిన్‌సిన్హా ఆకస్మికంగా తనిఖీలకు వచ్చినప్పుడు ఇసుక ఆక్రమ తవ్వకాలపై దృష్టి సారించాలని ఎస్‌ఐ భీమరాజుకు సూచించారు. నిబంధనలు పాటించని ట్రాక్టర్లపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కూటమి నేతలకు భయపడి అధికారులు కనీస చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

చోడవరం రూరల్: డీఎస్సీ ఎంపిక పరీక్షకు హాజరయ్యే బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులకు వెనుకబడిన తరగతుల సహాయ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనున్నట్టు చోడవరం బీసీ సక్షేమ అధికారి ఎం.నరసింహులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. నమూనా దరఖాస్తులను పూరించి తమ కార్యాలయానికి అందచేయాలన్నారు. టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే తమ కుల, ఆదాయ, జన్మదిన ధ్రువపత్రాలతో శిక్షణకు ఎంపిక కాబడతారన్నారు. ఎంపికైన వారికి ఆన్‌లైన్లో సంబంధిత శిక్షణ సంస్థ కోచింగ్ ప్రారంభిస్తుందన్నారు. అనకాపల్లి జిల్లా అభ్యర్థులు చోడవరం కార్యాలయంలో తమ దరఖాస్తులు అందచేయాలని, మరిన్ని వివరాలకు 9441293675, 9885845743 సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీం సభ్యులు

బుచ్చెయ్యపేట: విద్యార్థులకు చట్టాలపై పోలీసులు అవగాహన కల్పించారు. గురువారం సీతయ్యపేట, బుచ్చెయ్యపేట తదితర గ్రామాల్లో ప్రత్యేక వాహనం ద్వారా మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, పోక్సో కేసు, సైబర్ నేరాలు, క్రైమ్‌లు, పోలీస్ కేసులుపై విద్యార్థులకు శక్తి టీం సభ్యులు ద్వారా అవగాహన కల్పించారు.

వచ్చే నెల 10న లోక్ అదాలత్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షియాజ్ ఖాన్

నర్సీపట్నం: వచ్చే నెల 10న జరిగే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్ న్యాయవాదులకు సూచించారు. గురువారం స్థానిక కోర్టు సముదాయంలో లోక్ అదాలత్‌పై న్యాయవాదులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బు, సమయం వృథా చేసుకోకుండా రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవటం మేలు అన్ని విషయాన్ని కక్షిదారుల్లోకి తీసుకెళ్లాలన్నారు. లోక్ అదాలత్ కేసులు పరిష్కరించుకుంటే అప్పీల్‌కు అవకాశం ఉండదన్నారు. సమావేశంలో అడిషనల్ జూనియర్స్ సివిల్ జడ్జి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

మాడుగుల: ఈ నెల 19వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరగనుందని, ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో 2025- 26 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్ ఆమోదించడంతో పాటు వివిధ అంశాలుపై చర్చిస్తారన్నారు. మండలంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

ఒకేషనల్ విద్యతో విద్యార్థులకు మేలు

ఎంఈవో జగ్గారావు

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ కోర్సు పూర్తయిన 30 మంది విద్యార్థులకు గురువారం ఎంఈవో జగ్గారావు, హెచ్‌ఎం డీఎస్ ఎస్‌వీ ప్రసాద్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎస్.వి.ఆర్ హాస్పిటల్ సౌజన్యంతో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వారం రోజుల పాటు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం నిర్వహించారు. దీనివల్ల కలిగే మేలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి, భవిష్యత్‌లో ఇలాంటి ప్రోగ్రాం నిర్వహించాలని ఎస్.వి.ఆర్. ప్రోగ్రాం కోఆర్డినేటర్ శేషారావును ఎంఈవో, హెచ్‌ఎం అభినందించారు.



విద్యార్థులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంఈవో జగ్గారావు, హెచ్‌ఎం ప్రసాద్

భూ సమస్యలపై నిర్లక్ష్యం చేయొద్దు

తహసీల్దార్ వేణుగోపాల్



నాతవరం: భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని తహసీల్దార్ ఏ వేణుగోపాల్ తెలిపారు. ఆయన గురువారం తన కార్యాలయంలో సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ రైతులు భూ సమస్యలపై పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వాస్తవాలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నిబంధనలు అనుసరించి ఇరువురికి న్యాయం చేస్తామన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలు కాకుండా కాపాడే బాధ్యత వీఆర్వోలపై ఉందన్నారు. మండలంలో భూ రీసర్వేపై తీసుకోవలసిన జాగ్రత్తలపై చర్చించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ టీవీఎల్ రాజు, సర్వే డీటీ శివ, మండల సర్వేయరు ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల ఏఎంసీ చైర్మన్‌గా అప్పలరాజు

మాడుగుల/రూరల్: మాడుగుల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నాయకుడు పుప్పాల అప్పలరాజును నియమిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మాడుగుల మార్కెట్ కమిటీ ఏర్పడిన తర్వాత తొలి చైర్మన్‌గా శానాపతి కొండలరావు(వైఎస్సార్‌సీపీ) పని చేశారు. గత ప్రభుత్వ హయాంలో కొండలరావు నాలుగు మాసాల పాటు చైర్మన్‌గా వ్యవహరించారు. తాజాగా కూటమి ప్రభుత్వం రెండో విడతలో నియమించిన 30 మంది చైర్మన్ జాబితాలో అప్పలరాజును ఎంపిక చేసింది. తనకు ఏఎంసీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన సీఎం, డిప్యూటీ సీఎంతోపాటు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



అప్పలరాజును అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారు, తదితరులు

80 మంది నేత్ర శస్త్రచికిత్సలకు ఎంపిక



కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారితో సర్పంచ్ దాడి జగన్, స్థానిక నాయకుడు పోతల నాయుడు

దేవరాపల్లి: మండలంలోని ఎం. అలమండలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక సర్పంచ్ దాడి జగన్, స్థానిక నాయకుడు పోతల నాయుడు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో కిరణ్ విజన్ సెంటర్ ఆప్తాలమిస్టు జి.నానిబాబు 200 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 80 మందిని నేత్ర శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. 12 మందికి కళ్లద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పోతల వెంకటరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బండారు ప్రసాదరావు, పాలిపిరెడ్డి రమణ, రొంగలి మంగునాయుడు, ముర్రా నర్సింహమూర్తి, మేడిశెట్టి జగదీష్, గొర్లె మంగునాయుడు, రొంగలి నానాజీ, సూరెడ్డి గోవింద తదితర గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

చోడవరం రూరల్: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో గురువారం దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీని చేపట్టారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాలు దివ్యాంగులకు మరింత సహకారం అందుతుందన్నారు. డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు వివిధ రంగాల్లో రాణించిన దివ్యాంగుల కృషిని సభలో వివరించారు. పరవాడ దరి ఎన్టీపీసీ ఆర్థిక సాయం 13 లక్షలతో అనకాపల్లి జిల్లాలోని 262 మందికి ఉపకరణాలను అందిస్తున్నట్టు చెప్పారు. జిల్లా సహిత విద్యా సమన్వయకర్త శకుంతల మాట్లాడుతూ 23 బ్రెయిలీ కిట్లు, బ్యాటరీ సైకిళ్లు, క్లచ్ ట్రై సైకిళ్లు చెరి 9, 46 సి.పి.చైర్లు, రోలెటర్లు 8, వీల్ చైర్లు 73, ట్రైసైకిళ్లు 13, వినికిడి యంత్రాలు 69, బోధనోపకరణాల కిట్లు 13 అందచేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పి.వి.జి.కుమార్, తహసీల్దార్ రామారావు, ఎంఈవో సింహాచలం, జెడ్పీటీసీ విజయ మారిసెట్టి, ఎంపీపీ గాడి కాసు, హెచ్‌ఎం రామిరెడ్డి, సర్పంచ్ బి.నూకాలమ్మ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బోడ్డేడ గంగాధర్, ఎంపీటీసీ కె.రూప ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు



ఉపకరణాల పంపిణీని ప్రారంభించిన కార్పొరేషన్ చైర్మన్లు బత్తుల తదితరులు

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాలు పంపిణీ

కె. కోటపాడు: మండలంలో సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులకు ఉచితంగా ఉపకరణాలను గురువారం పంపిణీ చేశారు. చోడవరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో 11 మంది ప్రత్యేక అవసరాల పిల్లలకు కేటగిరీలు వారీగా నాలుగు వీల్ చైర్సు, నాలుగు సీపీ కుర్చీలు, రెండు చెవిటి మిషన్లు, ఒక బ్రెయిలీ కిట్‌ను జిల్లా విద్యా శాఖాధికారి, ఏపీసీ తో పాటు ప్రత్యేక అవసరాల జిల్లా సమన్వయ అధికారులు అందజేశారు.

పోషకాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం

ఎంపీపీ శ్రీనివాసరావు, సర్పంచ్ సత్యవతి



మాట్లాడుతున్న ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు



పోషకాహార స్టాళ్లను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ రమణమ్మ, ఎంపీడీవో ఉషాశ్రీ, సీడీపీవో మేరీ సువార్త



మంగళాపురంలో అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్

నర్సీపట్నం: పౌష్టికాహారంతోనే పరిపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చునని ఐసీడీఎస్ సీడీపీవో మేరీ సువార్త అన్నారు. ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీవో, జెడ్పీటీసీ సుకల రమణమ్మ, ఎంపీడీవో ఉషాశ్రీ మాట్లాడుతూ గర్భస్థ శిశువు నుంచి బిడ్డ పుట్టిన వెయ్యి రోజుల కాలవ్యవధి వరకు సంరక్షణ, ఈ సమయంలో గర్భిణీ, శిశువు ఆరోగ్యంగా ఉండడానికి తగిన పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేసి, పోషకాహార స్టాళ్లను పరిశీలించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, బీపీసీ కోఆర్డినేటర్ ప్రసాద్ పాల్గొన్నారు.

రోలుగుంట: పోషకాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ కొప్పుల వరలక్ష్మి తెలిపారు. స్థానిక పాత రామ మందిరం వద్ద కళ్యాణ మండపంలో రావికమతం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి రోలుగుంట, బుచ్చింపేట సెక్టారుకు సంబంధించి గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌వి వరహాలమ్మ, సెక్టారు సూపర్‌వైజర్లు రమ్మ, హైమ గర్భిణులకు సీమంతాలు చేశారు. రావికమతం ఐసీడీఎస్ ఏపీవో పుష్ప పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: సంపూర్ణ పోషకాలున్న సమీకృత ఆహారం తీసుకోవడంతో పూర్తి ఆరోగ్య వంతులుగా ఉంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, సర్పంచ్ కంటే పద్మరేఖ తెలిపారు. గురువారం మంగళాపురంలో పోషణ పక్వాడలో భాగంగా అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది ఎంఎస్‌కే మహాలక్ష్మి, రామలక్ష్మి, రాధాలక్ష్మి, విజయలక్ష్మి, రేవతి పాల్గొన్నారు.

ప్రత్యేక ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



మహలక్ష్మీనాయుడును సన్మానిస్తున్న డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, తదితరులు

రావికమతం: రాష్ట్ర గూగుల్ చాంపియన్ సర్టిఫికెట్ పొందిన మేడివాడ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయుడు మహలక్ష్మీనాయుడును డీఈవో గిడ్డి అప్పారావు, జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి. శకుంతల, చోడవరం ఎంఈవో సింహాచలం శాలువాతో ఘనంగా సత్కరించారు. జిల్లాలో దివ్యాంగ విద్యార్థులకు సేవలు అందించడమే కాకుండా వారికి ఉపయోగపడే డిజిటల్ టెక్నాలజీ యాప్‌లు గురించి రాష్ట్రంలో ప్రత్యేక ఉపాధ్యాయులకు ఇటీవలే శిక్షణ ఇచ్చారు. గూగుల్ లుక్ అవుట్, గూగుల్ లైవ్ ట్రాన్స్‌క్రైబ్ యాప్‌లు ఎక్కువగా ఉపయోగించే ముగ్గురు రిసోర్స్ పర్సన్లను గుర్తించి గూగుల్ చాంపియన్ సర్టిఫికెట్‌లను ఇటీవల అందజేశారు.

జాతీయ చిత్ర లేఖనం పోటీల్లో ప్రతిభ

దేవరాపల్లి: జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలలో దేవరాపల్లి కైరళి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. 12 మంది విద్యార్థులు స్వర్ణ, 16 మంది రజత పతకాలను కైవసం చేసుకున్నారు. విజయవాడలో డ్రీమ్ యంగ్, చిల్డ్రన్స్ ఆర్ట్స్ అకాడమీ, ఏపీ ఫారెస్టు డిపార్టుమెంట్ సంయుక్తంగా ఈ నెల 5న నిర్వహించిన ఈ పోటీలలో కైరళి స్కూల్ విద్యార్థులు 123 మంది పాల్గొన్నారు. వీరిలో విశేష ప్రతిభ కనబరిచి వారిని, డ్రాయింగ్ టీచర్ వై.సముద్రంను గురువారం ఎంఈవో బి.పడాల్‌దాస్, స్కూల్ కరస్పాండెంట్ ఎం.కె.దినేష్, హెచ్‌ఎం యు.లిస్సీ అభినందించారు. పాఠశాల యాజమాన్యానికి 'బాల ప్రోత్సాహక అవార్డు'ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీడీ బి.సంతోష్, ఈశ్వరరావు తదితర స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో పడాల్‌దాస్, కరస్పాండెంట్ దినేష్

ప్రజా దర్బార్‌కు ఫిర్యాదులు

దేవరాపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరాపల్లిలో గ్రామ కంఠం భూముల ఆక్రమణపై గంగవంశం సంతోష్ ఫిర్యాదు చేశాడు. దేవరాపల్లి సర్వే నెంబర్ 20లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని చొక్కాకుల వెంకటరావు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దేవరాపల్లిలో డిగ్రీ కాలేజీ నిర్మించాలని కొరుప్రోలు కోరారు. తిమిరాంలో శ్మశానవాటిక వద్ద ఇసుక కోసం భారీ గొయ్యిలు తవ్వడంతో ప్రమాదకరంగా మారిందని మామిడిపల్లి ఎంపీటీసీ పంచాడ సింహాచలంనాయుడు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పక్కన పచ్చ చొక్కా ధరించిన టీడీపీ చెందిన వ్యక్తి కూర్చోగా, ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యంలకు మూలన కుర్చీలు వేయడం పట్ల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

వడ్డాది అభివృద్ధికి సమష్టి కృషి



మాట్లాడుతున్న గిరిబాబు

బుచ్చెయ్యపేట: వడ్డాది పంచాయతీ అభివృద్ధికి గ్రామ పెద్దలంతా కలిసి రావాలని మోదకొండమ్మ ఆలయ కమిటీ చైర్మన్ దొండా గిరిబాబు కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ మూడేళ్ల క్రితం వడ్డాదిలో ఇసుక తరలింపునకు సేకరించిన రూ.15 లక్షలతోపాటు పదేళ్ల క్రితం మోదకొండమ్మ గ్రామ పండగలో మిగిలిపోయిన నగదు, కాపు, తెలగ సంక్షేమం కోసం సేకరించిన నగదును పోగు చేసి గ్రామాభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. మరలా మోదకొండమ్మ పండగను నిర్వహించడానికి పార్టీలకతీతంగా కలిసి రావాలని కోరారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

మాడుగుల: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో గురువారం డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు పలు సూచనలు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంఈఓ బి. దేముడమ్మ, ఫైర్ అధికారి వి. రాజేశ్వరరావు, ఫైర్ సిబ్బంది రామారావు, ఎస్.కె. మదీనా, వరహాలు, ఎమ్మార్సీ సిబ్బంది, రాజు, నాగేంద్ర, సీఆర్పీలు పాల్గొన్నారు.